# తెలియని నిజాలు

ఆఫీసులో తన సీటులో కూర్చుని, ఆ రోజున పైపు చెయ్యా వలసిన కాగితాల్ని మాటవరసకి పరిశీలిస్తూందన్న మాటే కాని, సరళ దృష్టి అంతా ఎదురుగుండా సీటులో కూర్చొని ఆఫీసుఫైళ్ళలోతలదూర్చి, పొద్దుటినుంచి కేవలంఒకజడపదార్థంలా ఉలక్కుండా, పలక్కుండా తన పనేదో తను చేసుకుపోతూన్న గోపాలంమీద వుంది. ఈ బుద్ధావతారం యీ సీట్లోకి కొత్తగా మారి రెండు రోజులయింది. ఇంతక్రితం యీ అయిదు అంతస్తుల ఆఫీసులోనూ ఏ సెక్షన్‌లో వుండి వచ్చాడో తెలియదు కాని, ఈ సీట్లోకి మారి తన యెదురుగుండా వేంచేసిన తరవాత అతనిగురించి తెలుసుకోకుండానూ, అధమం ఆలోచించకుండాను ఉండలేకపోతూంది.

'పక్కవాళ్ళని కొంచెమైనా పలకరించకుండా మరీ యంత్రంలా తలవంచుకొని ఆ వ్రాసుకోవడం ఏమిటి? కర్మ! ఈ యంత్రానికీ నాకూ ఒక గదిలో వచ్చిపడ్డాయి సీట్లు! నోరు విప్పి మాట్లాడడు సరిగదా, ఆ అందమైనకోలమొఖం, ఆ నొక్కునొక్కుల అందమైన జుట్టు కనిపించకుండా మొహ

నికి ఆ ఫైల్సుకూడా అడ్డంపెట్టుకుంటాడేమిటి? అయ్యో! రాత! ఈ మూగ యంత్రంకంటే, ఏం అతిగా వాగినా ఆ వాసే నయం. రోజుకో అరడజను సార్లయినా గుడ్ మార్నింగ్ కొట్టేవాడు. ఎంత చీదరించుకున్నా చిన్నబుచ్చు కోకుండా యేవో అర్థంలేని పలకరింపులు పలకరిస్తూ ఉండే వాడు. "కులాసాగా ఉన్నారా" అనీ, "ఫలానా పత్రికలో ఫలానా కథ చదివారా" అనీ, "ఏం యీ వేళ అలా ఉన్నారు? మీ అందమైన ముఖానికి ఆ బొమముడిపాటు ఏమీ బాగాలేదు సుమండీ" అనీ-ఇలా యేవో అంటూనే ఉండేవాడు. తనచుట్టూ ఓ గ్రహం తిరుగుతూందని లోపల ఆనందంగా ఉన్నా, మరీ ఆ వాసుచేసే చేష్టలు చూస్తూంటే అసహ్యం వేసేది చిన్నప్పుడు కాలేజీలో చేసిన రోజు లగాయితు, ఈ ఆఫీసులో టైపిస్టుగా ప్రవేశించి పని చేస్తూన్న ఈ రోజుదాకా తన చుట్టూ యేవో ఒకటో, రెండో గ్రహాలు తిరుగుతూ ఉండడం, వాళ్ళ గొడవ పట్టించుకోకుండా తను గర్వంతో ఉంటూ వుండడం అల వాటు ఎప్పుడూ ఒకళ్ళు తన గురించి ఆలోచించడమే కాని, తను ఒకళ్ళగురించి ఆలోచించి ఎరగదు.

'అటువంటిది, ఈ అందమైన బుద్ధవిగ్రహం యీ గదిలోకి వచ్చి యెదురుగుండా ఉన్న సీటుని ఆక్రమించు కొన్నది లగాయితు ఆలోచనలన్నీ యేకమై అటే పరుగెడు తున్నాయి. మొహం అందంగా బాగానేవుంది. పచ్చని

దృఢమైన శరీరం. భారీ విగ్రహం! కళ్ళుకూడా ఏవో మారతీరాలనున్న అందాల్ని చూస్తున్నట్లు మంచికాంతితో ఆకర్షణీయంగా ఉంటాయి.

'అబ్బ! ఇంత అందమయిన యువకుడు తనతో కలిసి పొద్దున్న పదిన్నర మొదలు సాయంత్రం అయిదింటిదాకా ఈ గదిలో కూర్చుంటూంటే, అతనితో మాట్లాడకుండా ఎలా ఊరుకోవడం! అందుకే ఒకటి, రెండుసార్లు కావాలని పలకరించి చూసింది సరళ-"ఇలా చూడండి, మిస్టర్. ఈ కాగితానికి చివర ట్రూ కాపీలని కొట్టాలా? దీనికి కాపీ కావాలా, అక్కర్లేదా? ఈ కాగితం ఈవేళ అర్జెంట్ అంటారా?" అంటూ. తను అడిగిన వాటి కన్నిటికీ అతను అవును, కాదు అంటూ ముక్తసరి సమాధానాలు చెప్పడం, తను మరీ ఇబ్బంది అయిన ప్రశ్న అడిగితే, సన్నగా నవ్వి ఊరుకోవడం. ఇంతకుమించి అతను చొరవ తీసుకుని మరి కొంతసేపు మాట్లాడడంలేదు.

"సంభాషణలని అంత నిర్దయగాఅతనుతుంచేస్తూంటే, తనకి బలే కోపంరాసాగింది. "ఊఁ, ఆఁ" అంటూ ఏమిటా హూంకులు! తనే అందమయిన వాడినని గర్వం కాబోలు! ఎంత అందం వుంటేమాత్రం అంత చేటు గర్వమా?"

సరళ తనలో తను నవ్వుకుంది. 'పాపం, అతనికిగర్వం ఏమిటి? మొహం చూస్తే అలా అనిపించడంలేదు. మరి

గర్వం కాకపోతే సరిగ్గా మాట్లాడడేం? అధమం యిటు తిరిగి చూడడేం?' కొద్దిగా దగ్గి గొంతు సవరించుకుని, గాజులు కదిపి గలగల మనిపించి చూసింది. 'ఉహుఁ! ఆ ప్రవరాఖ్యుడి కేం వినిపించ లేదు. బహుశా స్త్రీని కన్నెత్తి చూడనని శపథం చేశాడేమో! లేదా ఏ స్త్రీ చేతనయినా బలంగా మోసగించబడ్డాడేమో! అదీకాకపోతే సతీమణికి సదా విధేయుడేమో!

'అన్నట్లు ఇంతకీ ఇతనికి పెళ్లయిందా? అయిందను కోవడంలోకంటే కాలేదనుకోవడంలోనే మనస్సుకిశాంతిగా అనిపిస్తూంది. ఎందుకో! అయినా అయిందో లేదో తెలుసు కోవాలి. ఎలాగ? అతన్నే అడిగితే? ఏమని? "ఏమండీ, గోపాలంగారూ, మీకు పెళ్ళిఅయిందా" అనా? ఛ ... ఛ ... మరి ఏమిటిచేయడం?ఓరోజునఅయిదుకొడుతూంటేనేకుర్చీలోంచి లేచిన గోపాలాన్ని చూసి నవ్వుతూ, "ఏమండీ! అంత ఠంచన్‌గా ఐదు కాగానే వెళ్ళిపోతూవుంటారు ఆలస్యం అయితే యింటిదగ్గర అర్ధాంగిగారు ఆగ్రహిస్తారా?" అంది. అందుకు గోపాలం చిన్నగా నవ్వి వూరుకున్నాడేకాని, సమాధానం ఏం చెప్పలేదు. ఆ నవ్వు ద్వారా అతనికి పెళ్ళి అయిందో, లేదో అర్ధంకాలేదు సరళకి.

ఆ సంగతి తెలుసుకుంటేనేకాని, సరళకి స్థిమితం ఉండేలాగ కనిపించలేదు. అందుకే ఆ మరునాడు అరగంట ముందుగానే ఆఫీసుకి వచ్చింది. లిఫ్ట్‌లో పై అంతస్థులోకి

పోబోతూన్న వాసుని యథాలాపంగా అడిగినట్లు అడిగింది- "అవునూ ... ఇంతకీ గోపాలంగారికి పెళ్ళయిందా ?" అని.

"భలేవారే! పెళ్ళా? ఇద్దరు పిల్లలు కూడానూ" అంటూ లిఫ్ట్‌లోకి ఎక్కేశాడు వాసు.

సరళ తన సీటులోకివచ్చి కూచుని ఆలోచించ సాగింది. 'గోపాలానికి పెళ్లయిందా? అతని భార్య ఎలా ఉంటుందో! అతనికి ఉన్న గర్వాన్నిబట్టి చూస్తే ఆమె అందంగానే ఉండి ఉండాలి. నా కంటేనా?' సరళ గర్వంగా తనలో తను నవ్వుకుంది. 'ఏమయినా ఆమె నో మాటు చూడాలి. అవును. ఏదో ఒకవంక బెట్టుకొని వాళ్ల ఇంటికి వెళ్ళి చూడాలి!'

"గోపాలంగారు ఉన్నారాండీ?" అంటూ పోస్టుమన్ ఆమెని పలకరించడంతో సరళ తన ఆలోచనలోంచి బయట పడింది.

"ఇంకా రాలేదు. వచ్చేవేళయింది. ఏం?"

"ఆయనకి మనియార్డర్ ఉంది "

"ఎక్కడినుంచి? ఏది?" అంటూ కుతూహలంగా తీసు కొని కూపన్‌లోకి చూసింది. "ఫలానా సంచికలో మీరు వ్రాసిన కథకు ప్రతిఫలం, ఏభై రూపాయలు!"

'వాట్! ఈ గోపాలం కథకుడా?'

ఆ రోజల్లా సరళ గోపాలాన్ని ఆశ్చర్యంతో పరిశీ

లిస్తూనే వుంది. అతను మామూలుగా వంచిన తల మెత్త కుండా తన పని తను చేసుకుంటూనే ఉన్నాడు. ఆఖరికి ఉండబట్టలేక అడిగేసింది—"ఏమండీ గోపాలంగారూ, చెప్పారే కాదు... మీరు కథలు వ్రాస్తారా?" అని.

అతను ముక్తసరిగా నవ్వి, "ఆఁ ఏదో... అప్పు డప్పుడు" అన్నాడు.

అతని ముభావంచూస్తేసరళ కీమాటు చిరాకేవేసింది. "అలా చెప్పండి... అప్పుడప్పుడు వ్రాస్తారు కనకే లరుచు మీ పే రెప్పుడూ పత్రికలో చూసిన జాపకంలేదు" అంది హేళనగా.

గోపాలం మాట్లాడ లేదు.

"మీ కథలు పడిన పత్రికలు ఏమయినా వుంటే ఇస్తారా? చదివి ఇస్తాను" అంది కొంటెగా అతనికేసి చూస్తూ.

"అలాగే ... తీరిగా వెతికి ఇస్తాను" అన్నాడు గోపాలం.

"ఓహో! వెతకాలా? వెతికితే కాని కనిపించనంతటి కొద్దిపాటి రచన లన్నమాట! పోనిలెండి, పాపం! నా కోసం శ్రమపడి వెతక్కండి" అంది నోట్లో నాలికని గుండ్రంగా రెండు బుగ్గల్నీ ఉబికించేలా తిప్పుతూ.

ఇంకోరోజున ఉన్నట్టుండి మొదలు పెట్టింది సరళ— "అబ్బబ్బ! ఈ పత్రికలతోటీ, కథలతోటీ విసిగిపోతున్నాం

అండీ. ఒక్క కథా పట్టుగా వుండదు. ప్రతీదీ ఎక్కడో చదివినట్లు ఒకే మూసలో పోసినట్లుంటుంది. సీరియస్‌గా వుండవలసిన కథ పరమచెత్తగా నవ్వు వస్తూ వుంటుంది. నవ్వు రావలసిన కథలన్నీ ఏడుస్తూ వుంటాయి. మరి ప్రతి వాడూ కథ వ్రాయడమే! ఈ ఊరిమట్టుకి యీ వూళ్ళో పది హేనుగురు కథకులు ఉన్నారట! మా వీధిలోనే ఉన్నారట అందులో ముగ్గురు. ఖర్మ" అంటూ.

గోపాలం ముఖంలో ఆమె ఆశించిన మార్పులేం కని పించలేదు, 'ఇతనికి తన మాటల్లోని వ్యంగ్యం అర్థం కాలేదా? ఈ మాత్రం వేళాకోళం చేసేటప్పటికి, బిక్క మొహంవేసి, యేం సమాధానం చెప్పాలో అర్థంకాక, హేమా హేమీల్లాంటి యువకులంతా కుదేలయిపోయే వారు. ఇలాగే కదూ, ఈ మధ్యన నెలకో యువకుడు చొప్పున, తను ఏడిపించే ఏడిపింపుకి ఆగలేక బేజారెత్తి పోయి ఆ సీట్‌లోంచి హుటాహుటీ మార్పించేసుకున్నారు. వాళ్ళందరికంటే ఘనుడా యేమిటి ఈ గోపాలం? ఏమైనా సరే, ఇతన్ని వదలకూడదు. ఇతని బింకం ఏమిటో, గర్వం ఏమిటో అంతా తేల్చెయ్యాలి. అసలోమాటు వీళ్ళింటికి వెళ్ళివస్తే ఇతని అసలు రంగేదో తేలిపోతుంది. ఏదో వంక పెట్టుకొని వెళ్ళాలి.'

"ఏమండీ, గోపాలంగారూ! మీ ఇల్లిక్కడికిచాలా దూరమా?"

"అవునండీ"

"అహఁ... మీ ఇంటి కో మాటు వద్దాం అనుకుంటున్నాను లెండి."

"అలాగే... వీలు చూసుకుని ఓ రోజున నేనే తీసుకువెడతా" అన్నాడు గోపాలం.

ఎన్నాళ్ళు జరుగుతున్నా ఆ వీలయిన రోజు యేదో రావడంలేదు. ఓ రోజున కదిపితే, "ఇప్పుడు యింటినిండా బంధువులతో బిజీగా ఉన్నాం" అన్నాడు. ఇంకో రోజున అడిగితే, "సారీ! ఈ వేళ మా కో ఎంగేజ్ మెంట్ వుంది" అన్నాడు. నాలుగురోజులు పోయాక, "ఏమండీ!" అంటే, "వద్దురుగాని. నే చెపుతాగా" అన్నాడు.

'పిరికిగొడ్డు—బెదురుతున్నాడు యింటికి వస్తానంటే. ఏదో యిబ్బంది ఉందన్నమాట! ఇంతటితో ఇతన్ని వదలకూడదు. ఏమైనాసరే, ఇంటికి వెళ్ళి ఆ ఇబ్బంది యేదో తెలుసుకోవాలి. ఏమైవుంటుంది? ఎందుకింత భయపడిపోతున్నాడు? "రాను మొర్రో" అన్నా వినిపించుకోకుండా, "మా ఇంటికి టీకి రావా" లంటూ ప్రతి ఆదివారం ఆహ్వానించేవాడు వాసు. అలాంటిది నా అంతట నేను వస్తానంటే ఈ గోపాలం యిలా సంకోచిస్తాడేమిటి? దీని కేదో బలమైన కారణం వుండి వుంటుంది. ఏమై వుంటుంది?' ఇలా తర్కించుకుంటూన్న సరళకి, ఆ కారణం ఏదో ఇట్టే అర్థమైపోయింది. ఆ రోజు వచ్చిన వారపత్రికలో గోపాలం వ్రాసిన కథ చదివేసరికి.

ఆ కథలో మూర్ఖురాలైన భార్య, సంస్కారవంతు డైన భర్త. రచయితగా తన కళామయ జీవితాన్నతడు అందంగా మలుచుకోవాలని చూస్తూంటే, కళాహృదయమే లేని ఆ భార్య, అనుక్షణం అతణ్ణి నిరుత్సాహపరిచి అతని బ్రతుకు నొక చవిటి నేలగా మారుస్తూ వుంటుంది. దానితో ఉన్నతంగా ఎదగవలసిన ఆ సంస్కారి నిరాశగా, ముభా వంగా, ఏదో తప్పదన్నట్లు బతుకుతూ వుంటాడు. నిత్యమూ ఆ భార్యకీ, భర్తకీ జరిగే సంఘర్షణే ఆ కథ ఇతివృత్తం.

'చాలా పట్టుగా హృదయాన్ని కదిలించేలా వుంది. ఎంతో స్వాభావికంగావున్న అలాంటి కథ వ్రాయాలంటే కష్టం. ఒకవేళ వ్రాసినా, స్వానుభవంవల్ల వ్రాయవలసిందే కాని కేవలం ఊహించి వ్రాయడం అసంభవం. అందువల్ల ఈ కథ గోపాలం స్వంత జీవితానికి సంబంధించిందే అయి వుండాలి. ఆఁ అందుకు సందేహంలేదు. ఈ కథలో నాయికే అతని భార్య, ఇంటిదగ్గర అలాంటి మూరురాలయిన భార్య వుండడంవల్లే అతను ఎవరినీ యింటికి రమ్మని ఆహ్వానించ డంలేదు ఒకవేళ ఏ నాలాంటిదో తనంతట తాను వస్తా నన్నా, ఏదో కారణం చెప్పి తప్పిస్తున్నాడు. ఆమె మూర్ఖు రాలే కాదు, అనాకారి కూడా అయి వుంటుంది. అందుకే అతను నిరాశగా, నిస్పృహగా ముభావంగా..."

టైప్‌మిషన్ కీరాడ్ మీద వేళ్ళు ఉంచి అలా ఆలో చిస్తూ కూర్చున్న సరళ, అప్పుడే గదిలోకి ప్రవేశిస్తూన్న గోపాలం వాలకం చూసి చకితురాలయింది.

మొహం అంతా నీరసంగా డోక్కుపోయి ఉంది. కళ్ళు లోతుకుపోయాయి. బట్టలు నలిగిపోయి ఉన్నాయి. జుట్టుకూడా దువ్వుకున్నట్లు లేదు. మనిషి అంతా పాపం, ఏదో విరక్తిగా వున్నాడు. ఇంట్లో ఆ మహాతల్లి ఏం మనో వేదన కలిగించిందో! గోపాలాన్ని చూస్తే సరళకి జాలే సింది.

"ఏమండీ... ఈవేళ అలా వున్నారేం?" అంది.

గోపాలం నీరసంగానవ్వి, "అబ్బే... ఎలా ఉన్నాను? మామూలుగానే వున్నానే!" అన్నాడు.

"అదేమిటండీ! ఆ బట్టలూ మొహం అదీ చూస్తూంటే మీరు బాగా బడలిక చెందినట్లున్నారు."

"ఓ... అదా?... రాత్రి సెకండ్ షో సినిమాకి వెళ్ళ డంవల్ల పొద్దుపోయేదాకా మెలుకువగా ఉన్నాను. పైగా పొద్దుట నిద్ర లేచేటప్పటికే తొమ్మిదీ తొమ్మిదిన్నర అయింది. ఇంక బట్టలూ అవీ మార్చుకోడానికి టైము లేక ..."

'ఎంత కథ అల్లాడూ!'

"ఊం... సినిమాకి ఒక్కరే వెళ్ళారా, లేక మీ భార్యతోకూడా కలిసి ...?"

"మీకు పెద్ద సందేహ మొచ్చిందే!" అంటూ నవ్వుతూ మాట మార్చేశాడే కాని, ఆమెతో కలిసి వెళ్ళాను. వెళ్ళలేదు అని ఏదీ తేల్చలేదు గోపాలం.

సరళ తనలో తను నవ్వుకొంది. 'అయ్యో! పిచ్చి వాడా! నువ్వు చెప్పకపోతే నాకు అర్థంకాదు అనుకున్నావా? ఆడవాళ్ళు, అందులో నాలాంటి ఆడవాళ్ళుఇట్టే కనిపెట్టేస్తారు. నువ్వు ఎంత గడుసువాడివయినా మా దగ్గరి నుంచి నిజాన్ని దాచలేవు. మీ రచయితలు ఎలా వ్రాస్తాంటారో మాకు తెలియదూ? వీలయినప్పుడు చుట్టుపక్కల వాళ్ళ అనుభవాల్నీ వీల్లేనప్పుడు తమ అనుభవాల్ని రచనల్లోకి ఎక్కిస్తూ వుంటారు. కేవలం ఊహించి వ్రాయడం అంటే, అందులో అతి సహజంగా ఉండేలాగ వ్రాయడం అంటే మాటలుకాదు...' ఆలోచనలతో ఆ రోజున టైపే సాగలేదు ఆమెకి. ఆ రోజున టైప్ చెయ్యవలసిన కాగితాలన్నీ అమట్టునే వుండిపోయాయి. చేసిన ఒకటి, రెండు కాగితాలలోనూ చాలా తప్పులు వచ్చాయి. మెదడంతా గోపాలం, అతని భార్య తాలూకు ఆలోచనలతో గజిబిజిగా నిండిపోయింది.

ఆ సాయంత్రం ఇంటికి వెళ్ళబోతూ, "రేపు ఆదివారం మీ యింటికి వద్దాం అనుకుంటున్నానండీ... ఆంజనేయస్వామి గుడిపక్క సందులో మొదటి ఇల్లటగా మీదీ? వాసు చెప్పాడు" అంది.

తన మామూలు ధోరణిలో, "వద్దురుగాని లెండి. నే చెపుతాగా?" అన్నాడు గోపాలం.

ఆమె అతని మాట కంత ప్రాధాన్యం యివ్వ లేదు.

ఆదివారం సాయంత్రం నాలుగ యేసరికల్లా అద్దం ముందు అరగంట ముస్తాబయింది. కనుబొమలు నల్లగా దిద్దుకొంది. పెదిమలమీద మరింత ఎర్రదనం దిద్దుకొంది. అదికా దిది కాదని అరడజను చీరలని మార్చి, చివరికి ఓ చీరని యేరుకుని కట్టుకుంది. చెవులకి రింగులు పెట్టింది. రెండుజడలూ వేసుకొని, ఓ జడలో ఒకే ఒక గులాబీ పువ్వు తురుముకొని. ఓ జడ ముందుకీ, ఇంకో జడ వెనక్కీ వేసుకొని వానిటీబాగ్ తీసుకొని విలాసంగా బయలు దేరింది.

గేటు చప్పుడు కాకుండా తీసి, లోపలికి అడుగుపెడు తూనే, తీర్చిదిద్దినట్లున్న క్రోటన్స్ గులాబీ వరసల్ని, అంద మైన చిన్న గార్డెన్‌నీ చూసి ఆశ్చర్యపోయింది. వెంటనే 'పాపం! ఇవన్నీ గోపాలం వేసి వుంటాడు. భార్య అందంగా లేకపోయినా ఉద్యానవనమైనా అందంగా వుంటే ... అవును ... ఏం చేస్తాడు? ఇదో కాలక్షేపం' అను కొంది.

ఎదురుగుండా చక్కని డిజైన్లు కుట్టిన డోర్‌కర్టెన్. దానికి యిటూ అటూ వున్న కిటికీలకి సగందాకా గులాబీ రంగు పలచని కర్టెన్లు! అందంగా పసుపురాసి బొట్లుపెట్టిన గడప! ఈ అలంకరణలు చూస్తే గోపాలం భార్య మరీ

అంత మూర్ఖురాలు కాదేమో అనిపించింది ఆమెకి. మూర్ఖురాలు కాకపోతే అనాకారి కావచ్చుగా? ఏమైనా కొంచెం వేగం తగ్గింది. నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వస్తూంది.

గుమ్మం మెట్లు ఎక్కుతూండగా లోపలనుంచి పకపకా నవ్వులు వినిపించాయి. ఒకటి గోపాలం గొంతుకే. రెండోది? అంత శ్రావ్యమయిన కంఠమా భార్యది! అరుగు మీద కాలేసి కుతూహలం ఆగక కిటికీ కర్టెన్ పైనుంచి లోపలికి తొంగిచూసింది.

విద్యుద్ఘాతం తగిలినట్లాగిపోయింది.

ఎంత అందంగావుంది గోపాలం భార్య!

ఛమక్ మని యేదో కాంతి మెరిసినట్లే ఉందికాని, ఆమె అందరి ఆడవాళ్ళలాగా సామాన్యంగా లేదు. గోపాలం పక్క ఇంకో కుర్చీలో కూర్చుని కుర్రాడి చేతికి బంతిఇస్తూ నవ్వుతూన్న ఆమె ముఖంలో ఆ వెలుగేమిటి?

సరళ తల గిర్రున తిరిగినట్లయింది.

అంచనాలు తారుమారయి యింక అక్కడ ఒక్క క్షణం ఉండలేకపోయింది. ఇంతలో గోపాలం కొడుకు రెండేళ్ల వాడు విసిరిన బంతి కర్టెన్‌ని తోసుకునివచ్చి తన చీరని మరకచేసి వెళ్ళి గార్డెన్‌లో పడింది. సరళ కంగారుగా వెనక్కి బయలుదేరింది. ఆమె ఇంకా గేటుదగ్గరికి

వెళ్ళలేదు. కొడుకు విసిరిన బంతికోసం ఇవతలకి వచ్చిన గోపాలం, "ఎవరూ?... సరళా? వచ్చి లోపలికి రాకుండా వెళ్ళిపోతున్నారేం?" అన్నాడు. వెనక్కి తిరిగి చూడకుండా తడబడుతూ సరళ గేటు సమీపించింది. ఇంతలో "సరళ ఎవరూ" అంటూ గోపాలం భార్యకూడా కర్టెన్ తప్పించుకొని ఇవతలకి వచ్చింది.

వెనకాల తనని గోపాలం, అతని భార్య పరిశీలనగా చూస్తున్నారన్న భావంతో, కంగారు మరింత ఎక్కువై, గబగబా వచ్చేస్తూ, పాపం, తన వెనకాల పరుచుకొన్న నిశ్శబ్దంలో అనవసరంగా అవహేళనా పూర్వకమయిన నవ్వుల్ని ఊహించుకుంటూ, ఎదురుదెబ్బ తగిలి ముందుకి తూలి పడిపోబోయింది. లోకంలో తనకి తెలియని నిజాలు చాలా ఉన్నాయని మొదటిసారిగా తెలుసుకొన్న సరళ!